క్లుప్తంగా

డ్రోన్లతో ఆకతాయిలకు చెక్



పెడన: పాఠశాలలు, కళాశాలల వద్ద డ్రోన్ కెమెరాలతో నిఘా పెట్టి ఆకతాయిలకు చెక్ పెట్టేందుకు పెడన పోలీసులు చర్యలు తీసుకుంటున్నారు. పెడన పట్టణంలోని బీజీకే జెడ్పీహెచ్ఎస్, బొడ్డు నాగయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాలల వద్ద బుధవారం ఉదయం డ్రోన్ కెమెరాలతో నిఘా పెట్టారు. ముగ్గురు ఆకతాయిలను గుర్తించి తల్లిదండ్రులతో కౌన్సెలింగ్ ఇచ్చి తీవ్రస్థాయిలో హెచ్చరించి మొదటి సారిగా వదిలిపెట్టారు. రెండో సారి పాఠశాలలు, కళాశాలల వద్ద కనిపిస్తే రౌడీ షీట్ ఓపెన్ చేస్తామని పెడన ఎస్ఐ సత్యనారాయణ హెచ్చరించారు.

బాలగంగాధర్‌తిలక్‌కు నివాళి

మచిలీపట్నంటౌన్: ప్రముఖ స్వాతంత్య్ర సమరయోధుడు లోకమాన్య బాలగంగాధర్ తిలక్ జయంతిని స్థానిక గొడుగుపేటలోని వెంకటేశ్వర కాంప్లెక్స్‌లో కూనపరెడ్డి ట్రస్ట్ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా జరిపారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో నేతాజీ మిత్రమండలి కో–కన్వీనర్ ధూళిపాళ శ్రీరామచంద్రమూర్తి, సీహెచ్ మల్లేశ్వరరావు, విన్నకోట సుబ్బారావు, జుజ్జూరి ప్రసాదు, జొన్నలగడ్డ సుబ్రహ్మణ్యం, జేవీ సుబ్బారావు, కొండా ప్రసాద్, లాల్ బహుదూర్, తదితరులు పాల్గొన్నారు.

బదిలీపై వెళుతున్న ఫిజియోథెరపిస్టుకు సన్మానం

చల్లపల్లి: చల్లపల్లి కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో ఫిజియోథెరపిస్ట్ బాధ్యతలు నిర్వర్తించి బదిలీపై వెళుతున్న డాక్టర్ వంశీని ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు, తోటి వైద్యులు, సిబ్బంది బుధవారం ఘనంగా సన్మానించారు. వంశీ మచిలీపట్నం మెడికల్ కళాశాలకు డీఎంఈగా బదిలీపై వెళుతున్నారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ బి.ఎస్.శ్రీనివాస్, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ డైరెక్టర్ వరదా హరిగోపాల్, ఘంటసాల ఏఎంసీ చైర్‌పర్సన్ తోట కనకదుర్గ, ఆసుపత్రి వైద్యులు మహేష్, నీలిమ, రామకృష్ణ, నిహారిక, దుర్గాశైలజ, సీనియర్ నర్సులు, ల్యాబ్ టెక్నీషియన్లు, శానిటేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

పైడమ్మ అమ్మవారికి ఆషాఢం సారె

పెడన: పట్టణంలోని రామలక్ష్మీ వీవర్స్ కాలనీలోని శ్రీలక్ష్మీగణపతి స్వామి ఆలయం నుంచి ఆ కాలనీకి చెందిన ముత్తయిదువులు గ్రామదేవత పైడమ్మ అమ్మవారికి ఆషాఢ సారెను సమర్పించారు. బుధవారం ఉదయం కాలనీలోని గణపతి ఆలయం నుంచి భారీ ఊరేగింపుగా మేళతాళాలు, మంగళవాయిద్యాలతో బయల్దేరి పైడమ్మ ఆలయానికి చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన పిమ్మట సారె కింద పసుపు, కుంకుమ, గాజులు, చలివిడి, వడపప్పు, పానకం, పూలను అమ్మవారికి సమర్పించారు.

వేగంగా స్వర్ణ పంచాయతీ యాప్ పనులు

బంటుమిల్లి: మండల పరిధిలోని గ్రామ పంచాయతీలను స్వర్ణ పంచాయతీ యాప్ ద్వారా ఆన్‌లైన్ చేసేందుకు పనులు వేగంగా జరుగుతున్నాయి. ఈఓపీఆర్‌డీ శైలజకుమారి పర్యవేక్షణలో గత రెండు రోజులుగా పంచాయతీ, సచివాలయ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు మండల పరిషత్ ఆవరణలో కూర్చుని ఆన్‌లైన్ చేసే పనులు వేగంగా చేపట్టారు. ఈఓపీఆర్‌డీ శైలజకుమారి మాట్లాడుతూ స్వర్ణ పంచాయితీ ఆన్‌లైన్ పనులు రెండు రోజుల్లో పూర్తి చేయాల్సి ఉందన్నారు. స్వర్ణ పంచాయితీ యాప్ ద్వార గృహ యజమానులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. యజమానులు దీని ద్వారా ఎక్కడ ఉన్నా ఇంటి పన్నులు చెల్లించుకోవచ్చని, వారి ఆస్తులకు పూర్తి రక్షణ ఉంటుందని చెప్పారు.

కుంగిన ఉల్లిపాలెం వారధి అప్రోచ్‌లు

భారీ వాహనాల రాకపోకలకు తప్పని ఇబ్బందులు



కోడూరు: దివిసీమలోని తీరప్రాంత ప్రజలు మచిలీపట్నానికి దగ్గర మార్గంలో చేరుకునేందుకు కృష్ణానదిపై నిర్మించిన ఉల్లిపాలెం–భవానీపురం వారధి అప్రోచ్‌లు కుంగిపోయి ప్రమాదకరంగా మారాయి. ఉల్లిపాలెం, భవానీపురం ఇరువైపులా వారధి ప్రారంభం, ముగింపులో ఉండే రెండు అప్రోచ్‌లు కుంగిపోయాయి. వారధిని, రహదారిని కలుపుతూ నిర్మించిన ఈ అప్రోచ్‌లు కుంగిపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సుమారు మూడు అడుగుల మేర అప్రోచ్‌లు కుంగిపోవడంతో ఆ ప్రాంతంలో భారీగా గుంతలు ఏర్పడ్డాయి. ద్విచక్ర వాహనదారులు, కార్లను నెమ్మదిగా వెళుతున్నప్పటికీ, వారధిపైకి భారీ వాహనాలను ఎక్కించేందుకు డ్రైవర్లకు ఇబ్బందికరంగా మారింది. అప్రోచ్‌ల కింద భాగంలో ఉన్న మట్టి కుంగిపోవడంతో ఆ ప్రాంతంలో ఉన్న శ్లాబులు విరిగిపోయి, అప్రోచ్‌లు కుంగిపోయాయని ఇంజినీరింగ్ నిపుణులు చెబుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు వెంటనే మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ఏ క్షణమైనా కూలొచ్చు...తస్మాత్ జాగ్రత్త!

- అంపశయ్యపై కొత్తమాజేరు వంతెన
- పొక్లెయిన్ పనులతో మరింత ధ్వంసం
- అధికారులు, పాలకులు తక్షణమే కొత్త వంతెన కట్టించాలి
- పరిసర గ్రామాల ప్రజల విన్నపం



కొత్తమాజేరులో గుండేరుపై ఉన్న వంతెనను, పగిలిన పిల్లర్లను చూపిస్తున్న పరిసర గ్రామాల ప్రజలు

చల్లపల్లి: అసలే అంతంత మాత్రంగా ఉన్న కొత్తమాజేరు వంతెన తూటు, గుర్రపుడెక్క తొలగింపు పనుల్లో భాగంగా వంతెనపై భారీ పొక్లెయిన్ తిరుగాడడంతో దెబ్బతిని మరింత ప్రమాదకరంగా మారింది. గుండేరులో నాలుగు రోజుల క్రితం తూటు, గుర్రపుడెక్క వంతెనకు అడ్డుపడి గుట్టపడిపోయాయి. వంతెన పైనుంచి పొక్లెయిన్ తూటు తొలగింపు పనులు చేస్తోంది. ఈ పనుల్లో భాగంగా పొక్లెయిన్ తొండం తొట్టి తగిలి వంతెన కింద ఉన్న పిల్లర్లు ఛిద్రమవుతున్నాయి. వంతెన రెయిలింగ్‌లు విరిగిపోతున్నాయి. 52 ఏళ్ల క్రితం ఈ వంతెన పిల్లర్లను ఇటుకలతో నిర్మించారు. ఆ ఇటుకలు కాస్తా ఇప్పుడు పొక్లెయిన్ తొట్టి తగిలి పగిలిపోతున్నాయి. రాళ్లు ఊడిపోతున్నాయి. కొన్ని పిల్లర్లు గతంలోనే పగిలిపోయాయి. వంతెనకు ఉన్న బీములు సైతం బీటలు వారాయి. వంతెన మధ్యలో కింది భాగంలో స్లాబు పెచ్చులు ఊడిపోయాయి. ఇనుప చువ్వలు సైతం బయటపడ్డాయి. దీంతో ఆ వంతెనపై ప్రయాణం దినదిన గండం అన్నట్లుగా మారింది. దీనికి తోడు మూలిగే నక్కమీద తాటికాయ పడిన చందంగా అసలే కూలేందుకు సిద్ధంగా ఉన్న ఈ వంతెన పొక్లెయిన్ తాకిడికి మరింత దెబ్బతిని దాని మనుగడ ప్రశ్నార్థకంగా మారింది.

భారీ పొక్లెయిన్ కారణంగానే...

భారీ పొక్లెయిన్‌ను వంతెనపైకి ఎక్కించటం వల్ల వంతెన పూర్తిగా పాడైపోయిందని పరిసర ప్రాంతాల ప్రజలు ఆరోపిస్తున్నారు. కొత్త వంతెన నిర్మించకపోవటం వల్ల భవిష్యత్తులో ఎలాంటి ప్రమాదాలు చోటుచేసుకుంటాయోనని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొత్తమాజేరు, భోగిరెడ్డిపల్లి, రామఖండం, చిన్నాపురం, పెదయాదర, చినయాదరకు చెందిన వందలాది వాహనాల్లో వేలాది మంది ప్రజలు నిత్యం ఈ మార్గంలో రాకపోకలు సాగిస్తుంటారని వారు చెపుతున్నారు. పెదకళ్ళేపల్లి, మంగళాపురం ప్రాంత ప్రజలు కూడా ఈ మార్గాన్ని ఉపయోగించుకుంటారని అంటున్నారు. కనీసం 150 మంది కళాశాల విద్యార్థులు ఈ మార్గం ద్వారానే చదువుకునేందుకు వెళతారని అంటున్నారు. రోజులో వందలాది వాహనాలు ఈ మార్గంలో రాకపోకలు సాగిస్తాయని, నిత్యం రద్దీగా ఉండే ఈ వంతెన ప్రస్తుతం తూటు కాడ తొలగింపు పనుల కారణంగా మరింత పాడైపోయిందని ఆరోపిస్తున్నారు. దీనికి కారకులైన అధికారులు, పాలకులే బాధ్యత వహించి పాత వంతెన స్థానంలో వెంటనే కొత్త వంతెన నిర్మించాలని ఆయా ప్రాంత ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.



పొక్లెయిన్ తాకిడికి ఛిద్రమైన రెయిలింగ్ దిమ్మలు



తూటు, గుర్రపుడెక్క తీసే సమయంలో పొక్లెయిన్ తొట్టి తగిలి పగిలిపోయిన వంతెన పిల్లర్లు

ప్రమాదం జరగక ముందే స్పందించండి



వంతెన ఏ క్షణంలో నైనా కూలిపోవచ్చు. చేతులు కాలాక ఆకులు పట్టుకున్నా ఉపయోగం ఉండదు. ప్రమాదం జరిగాక బాధపడేకంటే జరగక ముందే మేల్కొని కొత్త వంతెన నిర్మించాలి.

–బొందలపాటి కోటేశ్వరరావు, కొత్తమాజేరు

వంతెన కింద అన్నీ బీటలే



ఇప్పటికే వంతెన కింద పూర్తిగా పాడైంది. పెద్ద పెద్ద బీటలు ఇచ్చాయి. పిల్లర్లు కూడా పూర్తిగా బలహీనమయ్యాయి. ఏ క్షణాన్నైనా వంతెన కూలొచ్చు. తూటు, గుర్రపుడెక్క తొలగింపు పనులతో వంతెన పరిస్థితి మరింత ప్రమాదకరంగా మారింది.

–జక్కా నెలబాలుడు, కొత్తమాజేరు

రెండుసార్లు అంచనాలు పంపాం



రూ.10 కోట్లతో వంతెనకు సంబంధించి అంచనాలు రూపొందించాం. ఇప్పటికి రెండుసార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాం. తాజా పరిస్థితిని కూడా వివరించాం. అంచనాలకు ఆమోదం లభించగానే కొత్త వంతెన పనులు ప్రారంభిస్తాం.

–పి.సురేష్, ఆర్‌అండ్‌బీ ఏఈ, మచిలీపట్నం

ప్రారంభంకాని రాకపోకలు



గుండేరు వంతెన వద్ద రోడ్డుకు పడిన గండిని చెట్ల కంపలతో కప్పెట్టి ఉంచిన దృశ్యం

చల్లపల్లి: కొత్తమాజేరు వంతెన వద్ద రోడ్డుకు పడిన గండిని పూడ్చే పనులు 24 గంటలు గడిచినా అధికారులు ఇంకా చేపట్టలేదు. ఈనెల 22వ తేదీ సాయంత్రం కొత్తమాజేరు వంతెన వద్ద రోడ్డు మార్గం గుండేరు డ్రెయిన్ నీటి ప్రవాహానికి కొట్టుకుపోయి పెద్ద గండి పడింది. దీంతో తాడిచెట్లు రోడ్డుకు అడ్డంగా వేసి ఆ మార్గంలో రాకపోకలు నిలుపుదల చేశారు. రాత్రి ఆర్‌అండ్‌బీ అధికారులు వచ్చి గండిని పరిశీలించారు. బుధవారం ఉదయమే మెటీరియల్ తెప్పించి గండిని పూడ్చి రాకపోకలు పునరుద్ధరిస్తామని చెప్పారు. కానీ బుధవారం సాయంత్రం వరకూ రోడ్డుకు పడిన గండి కాదుకదా అక్కడున్న చిన్నపాటి గుంత కూడా పూడ్చలేదు. దీనిపై మచిలీపట్నంకు చెందిన ఆర్‌అండ్‌బీ ఏఈ పి.సురేష్‌ను వివరణ కోరగా రోడ్డు గండి పూడ్చటానికి కావాల్సిన మెటీరియల్ ఇబ్రహీంపట్నం అవతల ఉన్న కేతనకొండ వద్ద నుంచి రావాల్సి ఉందని, అక్కడ భారీ వర్షాలు పడటం వల్ల మెటీరియల్ తీసుకురావటంలో కొంత జాప్యం జరిగిందని వివరించారు. బుధవారం సాయంత్రం వాహనాలు అక్కడి నుంచి బయలుదేరాయని, రాత్రికి రోడ్డుకు పడిన గండిని పూడ్చి రాకపోకలకు అనుమతిస్తామని తెలిపారు.

చిన్నపాటి వర్షానికే చిత్తడిగా మారిన రహదారులు



సూర్య అండ్ సన్స్ పక్క రోడ్లో నిలిచిన నీరు

మచిలీపట్నంటౌన్: గత రెండు రోజులుగా అడపాదడపా కురుస్తున్న వర్షాలతో నగరంలోని పలు పల్లపు రహదారులు నీటితో నిండి చిత్తడిగా మారాయి. ఈ రోడ్లకు ఇరువైపులా డ్రైన్లు కూడా సక్రమంగా లేకపోవడంతో నీరు పారుదల కాకుండా నిలిచి వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. డ్రైన్‌లలో ఉన్న వ్యర్థాలను పూర్తి స్థాయిలో తొలగించుకోవడంతో మురుగునీటి ప్రవాహం స్తంభించి ఎక్కడ నీరు అక్కడే నిలుస్తున్నాయి. నల్లటి బురద లాంటి సిల్ట్ కూడా రోడ్లపైకి చేరి వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. చిన్నపాటి వర్షాలకే పల్లపు రోడ్లలో నీళ్లు నిలుస్తున్నాయని అదే పెద్ద వర్షం కురిస్తే పరిస్థితి ఏంటని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నగరంలోని రాజా గారి సెంటర్ సమీపంలోని ధన్వంతరి ఆచార్య ఆసుపత్రి వద్ద మురుగునీరు పారే పరిస్థితి లేకపోవడంతో నీరు ఎగదన్ని రోడ్డుపై మురుగునీరు నిలిచిపోయాయి. అటుగా ప్రయాణించే వాహనదారులు ఆ మురుగు నీటిలోనే ప్రయాణిస్తూ ఇబ్బంది పడ్డారు. ఈ ఆస్పత్రికి వచ్చేవారికి పార్కింగ్ సౌకర్యం లేకపోవటంతో ద్విచక్రవాహనాలు, ఆటోలు, కార్లు రోడ్డుపైనే పెడుతుండటంతో ప్రతి రోజూ ట్రాఫిక్ సమస్య తప్పటం లేదు. కోనేరు సెంటర్ సమీపంలోని సూర్య అండ్ సన్స్ పక్క రోడ్‌లో వర్షపు నీరు నిలిచి ప్రజలు, దుకాణదారులు ఇబ్బంది పడుతున్నారు. 11, 12 డివిజన్‌ల పరిధిలోని భాస్కరపురం షిరిడి సాయిబాబా గుడి వద్ద రోడ్డు పల్లంగా ఉండటంతో రోజుల తరబడి నీరు నిలిచి భక్తులు, ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా కార్పొరేషన్ అధికారులు స్పందించి రోడ్లపై నీరు నిలవకుండా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

స్వచ్ఛ సర్వేక్షణ గ్రామీణ్ సర్వే చేసిన కేంద్ర బృందాలు



ఘంటసాలపాలెం ఎస్టీ కాలనీలో స్వచ్ఛ సర్వేక్షణ గ్రామీణ్ సర్వే చేస్తున్న కేంద్ర బృందం

ఘంటసాలపాలెం(ఘంటసాల): కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు దేశ వ్యాప్తంగా జరుగుతున్న స్వచ్ఛ సర్వేక్షణ గ్రామీణ్ – 2025 సర్వేలో భాగంగా ఘంటసాల మండలం ఘంటసాలపాలెం, శ్రీకాకుళం గ్రామాల్లో స్వచ్ఛ సర్వేక్షణ గ్రామీణ్ సర్వేను కేంద్ర ప్రభుత్వ ప్రతినిధుల బృందం బుధవారం నిర్వహించింది. ఈ సందర్భంగా సర్వే ప్రతినిధులు మాట్లాడుతూ జిల్లాలో స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్, పంచాయతీ రాజ్ శాఖ, గ్రామీణ నీటి పారుదల, పారిశుద్ధ్య శాఖల సంయుక్త ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ బృందంతో కలసి సర్వే చేస్తున్నట్లు చెప్పారు. అనంతరం కేంద్ర బృందం ప్రతినిధులు జె.శివ ఘంటసాలపాలెంలో, జి.శ్రీనివాస్ శ్రీకాకుళంలో స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ జిల్లా సభ్యుడు కె.పవన్ కుమార్ ఆయా గ్రామాల్లోని పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు, రోడ్లు, డ్రైనేజీలను పరిశీలించి వాటి నిర్వహణ, సౌకర్యాలు, మరుగుదొడ్లు తదితర సౌకర్యాలను సర్వే చేశారు. ఒక్కో గ్రామంలో 16 మంది చొప్పున రెండు గ్రామాల్లో ఎంపిక చేసిన కుటుంబాలను సందర్శించి వారి వివరాలు, జీవనోపాధి, మరుగుదొడ్ల నిర్వహణ, తడి పొడి చెత్త నిర్వహణ, పరిసరాల పరిశుభ్రత, మురుగు నీరు నిర్వహణ తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించి సర్వే యాప్ లో నమోదు చేశారు. ఆయా కార్యక్రమాల్లో ఘంటసాలపాలెం, శ్రీకాకుళం సర్పంచులు దోనె రజిని, ముప్పనేని రవిప్రసాద్, ఎంపీడీవో డి.సుబ్బారావు, డెప్యూటీ ఎంపీడీవో కె.వెంకటేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శులు బోలెం అర్జునరావు, జి.శ్రీనివాసరావు, గ్రామ ప్రముఖులు దోనె వెంకటేశ్వరరావు, వివిధ శాఖల అధికారులు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

ఆకస్మిక తనిఖీలతో అవాక్కయిన అధికారులు...

స్వచ్ఛ సర్వేక్షణ గ్రామీణ్ – 2025లో కేంద్ర ప్రకటించిన గ్రామాల పేర్లలో ఘంటసాల మండలం కొడాలి పంచాయతీ పేరు రావడంతో కేంద్ర బృందం ఆ గ్రామంలోనే పర్యటిస్తుందని అధికారులు, ప్రజా ప్రతినిధులు ఆసక్తిగా ఎదురు చూస్తూ సిద్ధంగా ఉన్నారు. కాని కేంద్ర బృందం ఎవరూ ఊహించని విధంగా ఘంటసాల మండలంలోని ఘంటసాలపాలెం, శ్రీకాకుళం గ్రామాల్లో పర్యటించడంతో అధికారులతో పాటు ప్రజా ప్రతినిధులు అవాక్కయ్యారు.

మెరుగైన వైద్య సేవలతోనే ప్రజాదరణ



ఇంద్రకుమార్‌ను సన్మానించిన వివిధ పీహెచ్‌సీల వైద్యాధికారులు

నాగాయలంక: మండలంలోని వైద్య ఆరోగ్యశాఖ ఉద్యోగులు, నాగాయలంక పీహెచ్‌సీ సిబ్బంది ఆధ్వర్యంలో స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారిగా పని చేస్తూ విజయవాడ ప్రభుత్వాసుపత్రికి బదిలీ అయిన డాక్టర్ ఇంద్రకుమార్ రెడ్డికి బుధవారం ఘనంగా వీడ్కోలు అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ సమాజంలో మెరుగైన వైద్యసేవలు అందించిన ప్రభుత్వ వైద్యాధికారులు తప్పనిసరిగా క్షేత్రస్థాయి నుంచి ప్రజల ఆదరణ చూరగొంటారని అన్నారు. పీహెచ్‌సీ నూతన వైద్యాధికారి డాక్టర్ కె.శ్యామ్‌ప్రసాద్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఇంద్రకుమార్ వైద్య సేవలను పలువురు వైద్యాధికారులు, ఉద్యోగులు కొనియాడారు. కార్యక్రమంలో వైద్యాధికారులు రాజేశ్వరరావు(ఎదురుమొండి), శిరీష(మండపాకల) రియాజ్(వేకనూరు) డాక్టర్ వి.శివరామకృష్ణ, గ్రామ సర్పంచి కైతేపల్లి అంకాలు, ఎన్‌జీఓ నాయకుడు బండ్రెడ్డి రాజేంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం డాక్టర్ ఇంద్రకుమార్‌ను ఘనంగా సన్మానించారు.

సంక్షిప్త వార్తలు

యువతులు ఆరోగ్య సూత్రాలు పాటించాలి

మచిలీపట్నంటౌన్: వసతి గృహాల్లో ఉంటున్న యువతులు ఆరోగ్య సూత్రాలను పాటిస్తూ వారి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని వైద్యుడు సాయి ప్రసాద్ సూచించారు. స్థానిక బుట్టాయిపేటలోని బీసీ సంక్షేమ శాఖ కళాశాల విద్యార్థినుల వసతి గృహంలో బుధవారం రాత్రి శ్రీ సత్యసాయి సేవాసమితి ఆధ్వర్యంలో ఆరోగ్య పరిరక్షణపై అవగాహన సదస్సు నిర్వహించారు. వైద్యులు అరుణకాత్యాయని, వీరంకి రాజీవి, నిఖిల, శృతిక, తేజస్విని విద్యార్థినులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో సత్యసాయి సమితి కన్వీనర్ పోతుకూచి ఆంజనేయ కుమార్, వార్డెన్ టి.అనిత కుమారి, సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

పరమేశ్వరునికి 175 కేజీల పెసలతో అభిషేకం

నాగాయలంక: ఆషాఢ బహుళ చతుర్దశి, మహాశివుడి జన్మనక్షత్రం ఆర్ద్ర పురస్కరించుకుని శ్రీరామపాద క్షేత్రం పుష్కర ఘాట్‌లోని శ్రీరామలింగేశ్వర మండపంలో బుధవారం రాత్రి భక్తులు సమర్పించిన 175 కేజీలకు పైగా పెసలతో అభిషేకించారు. అర్చకుడు అంబా సాయి కిరణ్‌శర్మ బ్రహ్మత్వంలో ఉభయదాతలు తుంగల రాము–అనూష దంపతులతో శివలింగానికి ఆర్ద్ర నక్షత్ర పూజ శాస్త్రోక్తంగా జరిపారు. క్షేత్రం చైర్మన్ ఆలూరి శ్రీనివాసరావు పర్యవేక్షణలో తలశిల రఘుశేఖర్, ఉప్పల లీలాకృష్ణప్రసాద్ పాల్గొన్నారు.

పంటలకు బీమా ప్రీమియం చెల్లించాలి

పెదప్రోలు(మోపిదేవి): ప్రధానమంత్రి ఫసల్‌బీమా యోజన పథకం కింద పసుపు, వరి పంటలు వేసిన రైతులు మీసేవ కేంద్రంలో ఈనెల 31వ తేదీలోగా పంటలకు బీమా ప్రీమియం చెల్లించాలని అవనిగడ్డ సబ్‌డివిజన్ వ్యవసాయ సంచాలకులు జేఎస్ జయప్రద సూచించారు. మండలంలోని పెదప్రోలు, నాగాయితిప్ప గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పసుపు పంటకు ఎకరానికి రూ.1,100, వరి పంటకు ఎకరానికి రూ.830 చెల్లించాలని తెలిపారు. ఏఓ హెప్సిబా రాణి, వీఏఏలు పాల్గొన్నారు.

చల్లపల్లిలో స్వచ్ఛ సర్వేక్షణ బృందం పర్యటన

చల్లపల్లి: పచ్చదనం, పరిశుభ్రత, పారిశుద్ధ్యం, తడి–పొడి చెత్త నిర్వహణ వంటి అంశాల్లో చల్లపల్లి పంచాయతీ పనితీరు అభినందనీయమని స్వచ్ఛ సర్వేక్షణ గ్రామీణ సర్వే బృందం సభ్యులు సి.రవివర్మ అన్నారు. బుధవారం వారు చల్లపల్లి పంచాయతీ పరిధిలోని నారాయణరావునగర్ అంగన్‌వాడీ కేంద్రాన్ని, మోడల్ స్కూల్, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లను తనిఖీలు చేశారు. ప్రభుత్వ కార్యాలయాల్లో మరుగుదొడ్ల నిర్వహణ, పారిశుద్ధ్యం, డ్రైనేజీలను పరిశీలించారు.

అనారోగ్యంతో హెడ్‌కానిస్టేబుల్ మృతి

కోడూరు: కోడూరు పోలీస్‌స్టేషన్‌లో హెడ్‌కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న కాగిత వెంకటేశ్వరరావు (55) మంగళవారం రాత్రి మృతిచెందారు. ఆయన కొంతకాలం నుంచి బ్రెయిన్ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నారు. ఎస్ఐ చాణిక్య, పోలీస్ సిబ్బంది వెంకటేశ్వరరావు మృతదేహానికి నివాళులర్పించారు.

శాకంబరీదేవిగా పార్వతి అమ్మవారు

కోడూరు: ఆషాఢమాసాన్ని పురస్కరించుకుని స్థానిక శివరామకృష్ణ క్షేత్రంలోని పార్వతి అమ్మవారిని బుధవారం శాకంబరీదేవిగా అలంకరించారు. ఆరుద్ర నక్షత్రాన్ని పురస్కరించుకుని సోమేశ్వరస్వామివారికి క్షీరాభిషేకం, అన్నాభిషేకాలను నిర్వహించారు.

సేంద్రియ ఎరువులతో అధిక దిగుబడులు

పెడన: రైతులు సేంద్రియ ఎరువులను వినియోగించి నాణ్యమైన దిగుబడులు సాధించవచ్చునని కృష్ణాజిల్లా వనరుల కేంద్రం డీడీ జ్యోతి రమణి అన్నారు. మండలంలోని కూడూరు రైతు సేవా కేంద్రంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జ్యోతి రమణి వరి పంటలో పాటించాల్సిన యాజమాన్య పద్ధతులను వివరించారు. జిల్లా వనరుల కేంద్రం ఏవో పద్మజ, పెడన ఏవో ఎస్.జెన్నీ రైతులకు సూచనలు చేశారు. రైతులకు కంది పప్పు విత్తనాలను వంద శాతం రాయితీలో అందజేశారు.

రైతులంతా పంట బీమా చేయించుకోవాలి

గూడూరు: ఖరీఫ్‌లో వరిసాగు చేస్తున్న రైతులంతా పంట బీమా చేయించుకోవాలని వ్యవసాయ శాఖ బందరు ఏడీఏ శ్రీనివాసరావు రైతులకు విజ్ఞప్తి చేశారు. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో బుధవారం మండల పరిధిలోని కోకనారాయణపాలెంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బ్యాంకులలో పంట రుణాలు తీసుకున్న రైతులకు బ్యాంకు ద్వారా పంట బీమా నమోదు జరుగుతుందన్నారు. క్రాప్ లోన్ తీసుకుని రైతులు ఎకరానికి రూ.830 చెల్లించి పంట బీమా నమోదు చేయించుకోవాలని కోరారు. తద్వారా ప్రకృతి వైపరీత్యాలు సంభవించి పంట నష్టం సంభవించినప్పుడు పరిహారం పొందవచ్చని వివరించారు. కార్యక్రమంలో ఏఓ జి.శివరామకృష్ణ, సర్పంచి బండి అంజలికుమారి, ఏఈఓ ప్రభాకర్, వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.

మహిళ అదృశ్యం

బంటుమిల్లి: మండలంలోని జయపురం గ్రామానికి చెందిన 20 సంవత్సరాల మహిళ అదృశ్యంపై మంగళవారం అర్ధరాత్రి పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ నెల 23వ తేదీన మామ్మతో కలసి సరుకుల కోసం బంటుమిల్లి వచ్చిన ఆమె సరుకులు కొని మామ్మను సెంటర్లో కూర్చోబెట్టి ఇప్పుడే వస్తానని చెప్పి వెళ్లి తిరిగి రాలేదు. ఎంత సేపటికీ ఆమె రాకపోవడంతో మామ్మ పోలీసులను ఆశ్రయించింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

డ్రైనేజీ పూడికతీత పనులు ప్రారంభం

కోడూరు: మండలంలోని ద్వారక దగ్గర నుంచి వేటపాలెం వరకు ఉన్న గోపన్న డ్రైనేజీ పూడికతీత పనులను బుధవారం ప్రారంభించారు. తూర్పు కృష్ణాడెల్టా ప్రాజెక్టు కమిటీ చైర్మన్ దేవనబోయిన వెంకటేశ్వరరావు ఈ పనులను ప్రారంభించారు.

తాడేపల్లిలో రైతు క్షేత్ర పాఠశాల

తాడేపల్లి(ఘంటసాల): వరి పంటలో సస్య రక్షణ, తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించేలా రైతులు కృషి చేయాలని కేంద్ర పాథాలజీ శాఖ ప్రతినిధి డాక్టర్ కె.వీరయ్య చౌదరి అన్నారు. ఘంటసాల మండలం తాడేపల్లి గ్రామంలో రైతు క్షేత్ర పాఠశాల కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. అనంతరం గ్రామంలోని పంట పొలాలను పరిశీలించారు. కార్యక్రమంలో డాక్టర్ ప్రేమ, ఇన్‌చార్జి ఏవో ఎం.రామ్మోహనరావు, రైతు వీరభద్రరావు, వీఏఏ ఎ.అబ్దుల్ నసీర్ అహ్మద్, రైతులు పాల్గొన్నారు.

శ్రీకాకుళం, అచ్చెంపాలెం గ్రామాల్లో పొలం పిలుస్తోంది...

ఘంటసాల మండలం శ్రీకాకుళం, అచ్చెంపాలెం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఇన్‌చార్జి ఏవో ఎం.రామ్మోహనరావు రైతులకు అవగాహన కలిగించారు.

నిడమర్రులో పొలం పిలుస్తోంది

కృత్తివెన్ను: ప్రస్తుతం వ్యవసాయంలో వచ్చే కలుపు నివారణకు రైతులంతా సరైన జాగ్రత్తలు తీసుకుని సస్యరక్షణ చర్యలు తీసుకోవాలని ఏడీఏ రమాదేవి అన్నారు. మండలంలోని నిడమర్రులో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనిలో భాగంగా రైతులు ఖరీఫ్‌లో చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులను ఆమె వివరించారు. కార్యక్రమంలో ఏవో మాధురి కిరణ్, అధికారులు అజయ్, సాయికుమార్, రైతులు పాల్గొన్నారు.

క్షయ వ్యాధిపై అవగాహన అవసరం

మచిలీపట్నంటౌన్: క్షయ వ్యాధిపై ప్రతి ఒక్కరూ అవగాహనతో మెలిగి వ్యాధిని నిర్ధారించి మందులు వాడితే అనారోగ్య సమస్య నుంచి బయట పడవచ్చు అని జిల్లా ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి టీబీ విభాగం సిబ్బంది సూచించారు. స్థానిక సబ్ జైల్లో బుధవారం క్షయ వ్యాధిపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు జైల్లో ఉన్న ఖైదీలకు వ్యాధి లక్షణాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జైలు సూపరింటిండెంట్ పి రమేష్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

డ్రెయిన్‌లో పారని నీరు- ముంపులో పంట పొలాలు



తరకటూరు ప్రాంతంలో వర్షాలకు చెరువులను తలపిస్తున్న పంట పొలాలు

గూడూరు: మచిలీపట్నం–విజయవాడ జాతీయ రహదారి వెంబడి ఉన్న చింతగుంట డ్రైన్ లో నీరు పారకపోవడంతో పంట పొలాలు ముంపునకు గురవుతున్నాయి. మండల పరిధిలోని తరకటూరు, చిట్టిగూడూరు, తుమ్మలపాలెం, గూడూరు ఆయకట్టుకు సంబంధించి మురుగునీరు చింతగుంట డ్రైన్ ద్వారా వచ్చి లజ్జబండ మురుగు కాల్వలో కలుస్తుంది. అయితే చింతగుంట డ్రైన్ కనీస నిర్వహణ లేకపోవడంతో డ్రైన్లో తూడు, గుర్రపుడెక్క, పిచ్చి చెట్లు పెరిగిపోయి నీరు కిందికి పారడం లేదు. దీంతో గత నాలుగు రోజులుగా ఎడతెరిపిలేకుండా కురుస్తున్న వర్షాలకు పంట పొలాలు ముంపునకు గురవుతున్నాయి. ఈ ఏడాది ఖరీఫ్ సాగు చేపట్టిన రైతులు సరైన వర్షాలు లేకపోవడంతో వెదజల్లే పద్ధతిలో వరిపంట సాగు చేస్తున్నారు. పంట ప్రస్తుతం మొక్క దశలోనే ఉండటంతో వర్షాలకు పైరు నీట మునిగిపోయింది. డ్రైన్ల అస్తవ్యస్త నిర్వహణ కారణంగా నీరు క్రిందకు పారే పరిస్థితి లేకపోవడంతో పంట కుళ్లిపోతుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే పొలాలు చెరువులను తలపిస్తుండటంతో నీరు బయటకు పోవడానికి ఎన్నిరోజులు పడుతుందో తెలియని పరిస్థితి. ప్రభుత్వం స్పందించి యుద్ధప్రాతిపదికన చింతగుంట డ్రైన్‌లో నీరు పారేందుకు చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

డ్రైన్ నిర్మాణ పనులు ప్రారంభం

తెలుగురావుపాలెం(ఘంటసాల): ఘంటసాల మండలం తెలుగురావుపాలెంలో జెడ్పీ 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.2 లక్షలతో నిర్మిస్తున్న సీసీ డ్రైన్ పనులను సర్పంచ్ రాచూరి ప్రసాద్ బాబు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామంలోని మురుగు నీరు బయటకు పోయేందుకు డ్రైనేజీ నిర్మాణానికి నిధులు మంజూరు చేసిన జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఉప్పాల హారికకు, సహకరించిన ఘంటసాల జెడ్పీటీసీ తుమ్మల మురళీకృష్ణలకు కృతజ్ఞతలు తెలియజేశారు.

రసాయనేతర పద్ధతులు అవలంబించాలి



ఘంటసాల: వరి పంటలో రసాయనేతర పద్ధతులు అవలంబించి అవశేష రహిత పంటల ఉత్పత్తులు సాధించాలని కేవీకే సమన్వయకర్త డాక్టర్ డి.సుధారాణి అన్నారు. ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం వారి ఘంటసాల కృషి విజ్ఞాన కేంద్రంలో కోరమాండల్ కంపెనీ సహకారంతో ఖరీఫ్ పంటల సాగులో మేలైన యాజమాన్య పద్ధతులపై అవగాహన, చర్చా గోష్ఠి కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. కేవీకే సస్యరక్షణ శాస్త్రవేత్త డాక్టర్ వెంకటలక్ష్మి మాట్లాడుతూ వరిలో చేపట్టాల్సిన ఎరువులు, కలుపు యాజమాన్యం, రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. సస్యరక్షణ శాస్త్రవేత్త డాక్టర్ రేవతి మాట్లాడుతూ వరిలో ఆశించే చీడపీడల యాజమాన్య పద్ధతులు, ఎలుకల నివారణ యాజమాన్యంలో చేపట్టాల్సి మెలకువలను రైతులకు తెలియజేశారు. కోరమాండల్ ప్రతి నిధులు నానో యూరియా, నానో డీఏపీ, వాటి పనితీరు, వినియోగించే విధానం, డ్రోన్‌తో పిచికారీ, ఇతర అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం రైతులు అడిగిన ప్రశ్నలకు శాస్త్రవేత్తలు సమాధానాలు తెలియజేశారు.

పోయినది

[illegible] S/o. [illegible] నేను ది. 21-07-2025వ తేది సోమవారం [illegible] సంబంధించిన [illegible] నెం : 887/1980, Dated : 24-04-1980 [illegible] పోయినది. [illegible]

సంప్రదించండి : 80002 42504

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు | వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు | శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

మచిలీపట్నం డివిజన్

99122 20543 (మచిలీపట్నం, పెడన)

79955 66983 (అవనిగడ్డ)

Office mail : sakshiads@gmail.com